## అది 2083

దాన్ని "స్పేస్ ఏజ్" అనీ, "ఆటమిక్ ఏజ్" అనీ, "ఎలక్ట్రానిక్ ఏజ్" అని యివ్వేవీ కాకుండా ఏదో "గార్బేజ్" అనో "పాసేజ్" అనో పిలుస్తున్నారు. 1983 నాటి "బ్లూఫ్లేమ్" రేస్ కారూ, "ఏరో ట్రైక్ 02" సూపర్‌ఫాస్ట్ రైలూ, "టి.యు. 14" సూపర్ సానిక్ ఏరోప్లేనూ వంటి వాహనాలను మ్యూజియంలో పెట్టి "పాపం ఆనాటి అనాగరిక మానవుడు" అని పెదవి విరుస్తున్న రోజులు.

పుట్టగానే మనిషి శరీరంలోకి కొన్ని చమత్కారమైన కాంతి కిరణాలు ప్రవేశ పెట్టబడుతున్నాయి. వాటి మూలంగా మనిషి ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు, ఎక్కడికి కావాలనుకుంటే అక్కడికి స్వేచ్ఛగా గాలిలోకి లేచి ప్రయాణం చెయ్యగలుగుతున్నాడు. దానితో అతనికి భూవాతావరణం దాటితే తప్ప భూమిమీద అసలు వాహనాల అవసరమే లేకుండా పోయింది.

భూ మండలంలో ఎక్కడా ఏ ఆఫీసులూ కనబడటం లేదు. వ్యవసాయమూ, నివాసమూ మాత్రమే ఇక్కడ జరుగుతున్నాయి. మిగిలిన సర్వప్రపంచ వ్యవహారాలకీ — భూమికి వెయ్యిమైళ్ళఎత్తున రోదసిలో ఒక బ్రహ్మాండమైన ఉపగ్రహం వుంది. అది నిలయం.

మానవుడెంతో ఎదిగిపోయాడు. దేశాల మధ్య సరిహద్దులు లేవు. అధికారాల కోసం కొట్టుకోవడంలేదు. వసుధైక కుటుంబంగా సాగిపోతోంది. ప్రతినిత్యం భూమినుంచి కొన్నివేలమంది విధి నిర్వహణకోసం ఉపగ్రహానికి వెళ్ళివస్తున్నారు.

### మినీకథ

# అలవాటు




భూమికి సుమారు రెండు మైళ్ళ ఎత్తున ప్రతి ప్రాంతంలోనూ, భూమ్యాకర్షణ శక్తికి అతీతంగా ఒక ప్లాట్‌ఫారంవంటిది వుంది. భూమి నుంచి ఉపగ్రహానికి వెళ్ళేవాళ్ళందరూ ఎవళ్ళ సమయానికి వాళ్ళు ఆ ప్లాట్‌ఫారంమీదకి చేరుతున్నారు. అక్కడికి రైలో విమానమో అర్థంకాని పెద్ద "క్యూబికిల్" వంటి వాహనం ఒకటి వస్తోంది. అందరూ దానిలోకి ఎక్కుతున్నారు. అది రెండు నిమిషాలలో ఆ అందరినీ ఉపగ్రహానికి చేరుస్తోంది. తిరిగి అదే పద్ధతిలో విధి నిర్వహణానంతరం ప్లాట్‌ఫారాల మీదికి చేరుకుంటున్నారు.

అప్పుడే క్రొత్తగా విధిలోకి చేరాడొక వ్యక్తి. తిరిగి తన ప్రాంతం చేరుకోవడానికి వెళ్ళే క్యూబికిల్ కోసం "వెయిటింగ్ ఛాంబర్"లో నిలబడ్డాడు. రంగు రంగుల క్యూబికిల్ వాహనాలు వస్తున్నాయి. ఏప్రాంతవాళ్ళు ఆ రంగు క్యూబికల్ వచ్చినపుడు సరదాగా కబుర్లు చెప్పుకుంటూ, ఒకళ్ళ తరువాత ఒకళ్ళు, చాలా క్రమశిక్షణలో లోపలికి ఎక్కుతున్నారు.

ఇంతలో ఒక కాషాయ రంగు క్యూబికల్ వచ్చింది. అక్కడక్కడ చెదురుమదురుగా నిలబడ్డ కొందరు గబగబా పరిగెత్తుకుంటూ వచ్చి క్యూబికిల్ లోపలికి వెళ్ళే మార్గం దగ్గర, లోపలికి వెళ్ళడానికి తోసుకుంటున్నారు. మరికొందరు వాహనానికున్న కిటికీలగుండా చేతి రుమాళ్ళు బ్రీఫ్ కేసులూ వంటివి లోపలికి సీట్లమీదికి విసిరి వచ్చిగుంపులో తోసుకుంటున్నారు! అంతా నానా గలాభాగా వుంది.

క్రొత్తగాచేరిన ఆవ్యక్తి ఆశ్చర్యపోయి ప్రక్కనవున్న మరొక వ్యక్తిని "ఎవరు వాళ్ళు? ఎందుకలా తోసుకుంటున్నారు? ఇంత అభివృద్ధి చెందిన ప్రపంచంలో ఈ క్రమశిక్షణా రాహిత్యం ఏమిటి?" అని అడిగాడు.

అతను సమాధానం చెప్పాడు - "వాళ్ళ గురించి చాలా చెప్పాలి. ఇప్పుడంత టైం లేదు. టూకీగా చెప్తాను. వాళ్ళని ఆంధ్రులంటారు. అలా తోసుకుని ఎక్కితేనేగాని వాళ్ళకి ఎక్కినట్టుండదు. అందులో వంద మంది పట్టే చోటున్నా, బయట ఎక్కేవాళ్ళు యిద్దరే వున్నా ఆ ఇద్దరూ అలాగే తోసుకునే ఎక్కుతారు. ఒక వేళ ఎక్కేవాడు ఒక్కడే వున్నాడనుకో, ఎవడినన్నా పిలిచి, బతిమాలి మరీ తోయించుకుంటాడు. అది తప్పని నువు చెప్పావనుకో, నిన్ను చూసి నవ్వుతారు. అది వాళ్ళకి తెలియక కాదు. వాళ్ళు మహా మేధావులు. ఈ "గార్బేజ్" మహా వైభవానికి వాళ్ళే ప్రధాన కారణం. కాని ఏం చేస్తారు పాపం? కొన్ని వందల యేండ్లుగా వాహనాలలోకి అలా ఎక్కడం వాళ్ళ అలవాటు."

—విశ్వనాథ పావనిశాస్త్రి

చిత్రకారుడు : మారేమండ శ్రీనివాసరావు, శ్రీశైలం



"గణపతి పప్పా మోరియా"

Printed and Published by K. L. N. Prasad at Andhra Printers Ltd., Vijayawada- 10
Editor : Puranam Subrahmanya Sarma.